# చిరు దివ్వెకు ఆలంబన

## అమ్మ పెంపకంలో ప్రముఖులైన తీరు

ఈనాడు, హైదరాబాద్

మొదటి గురువు అమ్మ.. బుడి బుడి తప్పటడుగులను సరిచేయడం మొదలు జీవితంలో స్థిరపడే వరకు ప్రతి దశలోనూ అమ్మ మార్గదర్శకం ఆదర్శం. తను త్యాగాలు చేస్తూ.. కొవ్వొత్తిలా కరిగిపోతూ.. మాతృత్వపు మమకారాన్ని పంచుతూ.. పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే వారెవరైనా ఉన్నారంటే అమ్మ ఒక్కరే. ఉన్నత స్థితికి ఎదిగిన ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ త్యాగం ఉంది. మారిన నగర జీవనశైలిలో పిల్లల పెంపకంలో మాతృమూర్తులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ఉద్యోగం.. మరోవైపు వారి అలనాపాలనాలో పడి తన ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోవడం లేదు. ఆంగ్లంలో చెప్పాలంటే ఒక రకంగా అమ్మది 'థాంక్‌లెస్ జాబ్'. నిజానికి ఏ అమ్మా తమ పిల్లల నుంచి కృతజ్ఞతలు కోరుకోదు. అనురాగం చూపిస్తే చాలు. మాతృదినోత్సవం సందర్భంగా కొందరు ప్రముఖులను 'ఈనాడు' పలకరించినప్పుడు వారి ఎదుగుదలలో అమ్మ చూపిన బాట వెలకట్టలేనిదన్నారు.



### తల్లే తోడు నీడగా... – అభినయ విజయం స్ఫూర్తిమంతం

ఆడపిల్ల పుట్టింది.. తమ ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని.. ఆ తల్లిదండ్రుల సంతోషానికి అవధుల్లేవు. ఆ రూపు...ముఖ వర్చస్సు చూసి మురిసిపోయారు. ఆమెను పెద్ద సినిమా యాక్టర్ చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నారు. వెంటనే అభినయ అనే పేరును కూడా నిశ్చయించేశారు. కొన్ని రోజుల వ్యవధిలోనే అసలు విషయం తెలిసి ఆ తల్లిదండ్రులు హతాశులయ్యారు. పాపకి వినికిడి శక్తి లేదని వైద్యులు చెప్పడంతో వారి కలలన్నీ కరిగిపోసాగాయి. అయినా వారు అధైర్య పడలేదు. అప్పటి నుంచి అభినయకు అన్నీ తామై ఆమె తల్లి హేమలత తోడుగా నిలిచారు. సాధారణంగా వినికిడి శక్తి లేని వారికి మాట్లాడే శక్తి కూడా ఉండదు. అయినా పట్టుదలగా ఇలాంటి పిల్లల కోసం నిర్వహించే ప్రత్యేక పాఠశాలకు తీసుకెళ్లి శిక్షణ ఇప్పించారు. పదోతరగతి వరకు నగరంలోనే అభినయ విద్యాభ్యాసం పూర్తి చేశారు. అభినయకు 12వ ఏట కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్స చేశారు. దీంతో కొంత వినికిడి శక్తి రావడంతో స్పీచ్ థెరపీ ఇప్పించారు. పెదాల కదలికలను బట్టి ఎదుటి వారి మాటలను క్రమేపీ అర్థం చేసుకునేది. ఎయిర్‌ఫోర్సులో పనిచేసే తండ్రి ఆనంద్‌శర్మ సినిమాల్లో చిన్నచిన్న పాత్రల్లో నటించేవారు. ఆ పరిచయాలతో అభినయను కూడా నటిని చేసేందుకు ప్రయత్నాలు మొదలెట్టారు. పాఠశాలలో చదువుకునే సమయంలో కొన్ని ప్రకటనల్లో ఆమె నటించి మెప్పించారు. ఇప్పటివరకు శంభో శివ శంభో... దమ్ము, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి సినిమాలు మంచిపేరు తెచ్చిపెట్టాయి. త్వరలో తమిళం, మలయాళం సినిమాల్లో కథనాయిక పాత్రలకు ఎంపికైంది. హిందీలో ఒక సినిమా చేయనుంది. హాలీవుడ్‌లో నటించే ఛాన్సూ కొట్టేసింది. అభినయ ప్రతి విజయంలో ఆమె అమ్మే కన్పిస్తుంది.



**అమ్మే చిన్నారుల భవితకు విధాత**

### ఆమె ఇచ్చిన స్ఫూర్తి వెలకట్టలేనిది

**– డాక్టర్ పి.రఘురాం, సీఈవో, ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్**

ఒక వ్యక్తి శక్తిగా మారాడంటే...అతని విజయంలో కుటుంబ పాత్ర ఎంతో గొప్పది. అందులో తల్లి పాత్ర వెలకట్టలేనిది. రొమ్ము క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ రఘురాం విజయంలో కూడా ఆయన తల్లి డాక్టర్ ఉషాలక్ష్మి ఇచ్చిన స్ఫూర్తి ఎంతో గొప్పది. కష్టపడే తత్వం, విలువలు, సామాజిక బాధ్యత అంటే ఏమిటో తల్లి నుంచి చిన్నతనం నుంచే ఆయన వంటపట్టించుకున్నారు. తల్లి అడుగు జాడలోనే తాను నడిచారు. దేశం గర్వించే గొప్ప వైద్యుడిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. ఒకేసారి మూడు ప్రముఖ కళాశాలల ఎఫ్ఆర్‌సీలో ఉత్తీర్ణత సాధించిన ఘనత సాధించినా...తర్వాత రాయల్ కాలేజ్ ఆఫ్ లండన్ గౌరవ ఎఫ్ఆర్‌సీ ఇచ్చినా...దాని వెనుక తన కోసం తల్లి పడ్డ శ్రమ మరువ లేనంటారాయన. లండన్‌లోని ప్రఖ్యాత కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో వైద్యుడిగా సేవలు అందించే అరుదైన అవకాశం దక్కినా. ..తల్లి కోసం ఆ హోదాను వదులుకొని మాతృభూమికి చేరుకున్నారు. తన ఎదుగుదలకు అహర్నిశలు శ్రమించిన తన మాతృమూర్తికి రొమ్ము కేన్సర్ అని వైద్యులు చెప్పడంతో లండన్‌లో ఉండలేకపోయారు. తల్లికి దగ్గరుండి సేవలందించేందుకు ఇక్కడకు విచ్చేశారు. ఆమెకు నయం అయిన తర్వాత కూడా లండన్ వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. అమ్మ ఇచ్చిన స్ఫూర్తితోనే ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ స్థాపించి... పేదలకు ఇతోధికంగా సాయం చేస్తున్నారు. తన విజయంలో ప్రతి పేజీలోనూ అమ్మే పేరే కన్పిస్తుందని గర్వంగా చెబుతారు డాక్టర్ రఘురాం. ఎంత బీజీగా ఉన్న పిల్లలతో కాసేపైనా గడిపి...వారి మంచిచెడ్డలు తెలుసుకోవాలి...ఇదే తాను కూడా తూ.చ. తప్పకుండా పాటిస్తున్నానని తెలిపారు.



### ఉద్యోగాన్ని వదులుకున్నారు

**– మిథాలీరాజ్, భారత మహిళా క్రికెట్ కెప్టెన్**

క్రికెట్‌లో అప్పుడప్పుడే ఒనమాలు నేర్చుకుంటున్నాను. మహిళా క్రికెట్‌కు పెద్దగా గుర్తింపు లేదు. ప్రొఫెషనలిజం ఇంకా రాలేదు. తొమ్మిదిన్నర ఏళ్ల వయసులో నేను సాధన మొదలెట్టాను. కెరీర్‌గా మల్చుకోవాలంటే ప్రాక్టీస్ మరింత పెరగాలి. రోజుకు ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటలు సాధన. మధ్యలో చదువు. శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉండాలంటే ఆహారంలో జాగ్రత్తలు తప్పనిసరి. అమ్మ లీలారాజ్ ఒకవైపు ఉద్యోగం చేస్తూ .. మరోవైపు ఇవన్నీ చూసుకోవడం క్లిష్టంగా మారింది. నా కోసం అమ్మ ఉద్యోగాన్ని వదులుకున్నారు. వేళకు అన్నీ సమకూర్చేవారు. క్రికెట్‌తో పాటూ చదువూ ముఖ్యమే. పదోతరగతిలో సిలబస్ పూర్తి చేయడం కష్టమయ్యేది. అమ్మే బాగా సహాయం చేసేది. ఒక్కోసారి క్యాంపులకు వెళ్లినప్పుడు పుస్తకాలను వెంట తీసుకెళ్లేదాన్ని. ఆ సమయంలో నేను ఇంట్లో ఎక్కువ ఉండేదాన్ని కాదు. ఎవరైనా పిల్లలు రోజురోజూ ఎదగడం అమ్మానాన్నల మధ్యే జరిగిపోతుంటుంది.
నా వరకు క్యాంపుల్లో ఎక్కువ గడపడంతో వెళ్లినప్పటికీ తిరిగివచ్చేటప్పటికీ ఎంతో ఎదిగిపోయేదాన్ని. క్రికెట్‌లో కెరీర్ ప్రారంభించాక ఆట కోసం వేర్వేరు దేశాల్లో ఎక్కువ గడుపుతుంటాను. క్రికెట్ లేనప్పుడు మాత్రం ఎక్కువగా ఇంట్లోనే గడుపుతుంటాను.



### తాభలే



బాగ్‌లింగంపల్లి వద్ద ఓ పార్కులో తాబేలు బొమ్మను చూసి ముచ్చటపడి దానిపై కూచుని సవారీ చేస్తున్నట్లుగా ఆడుకుంటున్న బాలుడు

## అమ్మకు బహుమతి.. ఆడపిల్లలే ముందు

అమ్మకు ఏం బహుమతి ఇవ్వగలం.. ఆమె త్యాగానికి ఏ కానుకలిచ్చినా సాటిరావు.. తమ ప్రేమను చాటుకునేందుకు ప్రత్యేక సందర్భాల్లో పిల్లలు అమ్మలకు బహుమతులు ఇస్తుంటారు. వీటి ఎంపిక అంత సులువేమీ కాదు. టైటాన్ వాచెస్ సంస్థ ఇటీవల నిర్వహించిన గిఫ్టాలజీ సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. సందర్భాన్ని బట్టి ఆత్మీయులకు, మిత్రులకు కానుకలిస్తుంటాం. మిగతా వారికి బహుమతుల ఎంపికలో క్లిష్టత ఉన్నా పెద్ద కష్టమేమీ కాదు. అమ్మకు బహుమతి అనగానే ఏమిచ్చి ఆమె రుణం తీర్చుకోగలం అంటున్నారు హైదరాబాదీయులు. అమ్మకు కానుకలు ఇవ్వడంలో ఆడపిల్లలే ముందుంటున్నారు. మగపిల్లల కంటే అమ్మపై తమకే ఎక్కువ ప్రేమని చాటుతున్నారు.

### సర్వేలో స్పందించిన నగరవాసులు ఇలా.. శాతాల్లో...

| అమ్మకు కానుకను ఎంపిక చేయడం చాలా కష్టం | అమ్మే ఎప్పటికీ మర్చిపోలేని బహుమతినిస్తుంది | ఆమెకు కానుక ఎంపికలో శ్రమిస్తున్న 18-24 ఏళ్లవారు |
| --- | --- | --- |
| 13 | 12 | 19 |

| తల్లికి బహుమతి సులువుగా ఎంపిక | |
| --- | --- |
| అమ్మాయిలు | అబ్బాయిలు |
| 25 | 20 |

| తండ్రికి తేలిగ్గా కానుక ఎంపిక | |
| --- | --- |
| అబ్బాయిలు | అమ్మాయిలు |
| 10 | 05 |